# 6

# క్రొత్త నిబంధన క్రింద సత్యారాధన

విగ్రహాలను ఆరాధించటం, ఆరాధనలో అన్యాచారాలను ఉపయోగించటం దేవునికి అంగీకారం కాదని యూదుల ఆరాధనలో మనం నేర్చుకొన్నాం. బైబిలు దేవుడు రోషము గల దేవుడు (నిర్గమకాండము 20:3-5) మరియు ఆయనే అద్వితీయ సత్య దేవుడు. ఆయనను మాత్రమే ఆరాధించాలి, ఆయన సూచించిన మార్గములోనే ఆరాధించాలి.

ద్వితీయోపదేశకాండము 6:13, 10:20లను యేసు ఎత్తి పలుకుతూ, "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను" అని చెప్పారు (మత్తయి 4:10). తక్కిన దేవతలన్ని బహిష్కరించబడ్డాయి. ఆరాధకుడు దేవున్ని మాత్రమే ఆరాధించాలి మరియు ఆయనచే ఆజ్ఞాపింపబడినది మాత్రమే చేయాలి. మోషే యిలా హెచ్చరించాడు,

> మీరు ఇతర దేవతలను, అనగా మీ చుట్టునున్న జనముల దేవతలను సేవింపకూడదు. నీ మధ్యనున్న నీ దేవుడైన యెహోవా రోషముగల దేవుడు గనుక నీ దేవుడైన యెహోవా కోపాగ్ని ఒకవేళ నీమీద రగులుకొని దేశములో నుండకుండ నిన్ను నశింపజేయును (ద్వితీయోపదేశకాండము 6:14, 15).

## ఆరాధనా హద్దులు

"ఆయన కట్టడలన్నియు ఆజ్ఞలన్నియు గైకొనుచు" అని ఇశ్రాయేలు ప్రజలకు దేవుడు మోషే ద్వారా బయలుపరచాడు (ద్వితీయోపదేశకాండము 6:2). వారన్నిటికి లోబడాలి అనేది ఈ ప్రతిపాదన యొక్క అర్థం - దేవుడు ఆజ్ఞాపించిన దానికి ఏ తక్కువ చేయకూడదు. వారు ఏరుకొని తీసికొనకూడదు, కాని దేవుని ధర్మశాస్త్రంలో బయలుపరచ బడిన ప్రతి ఆజ్ఞను వారు అనుసరించాలి.

పైగా, దేవుడు ఆజ్ఞాపించింది మాత్రమే ఇశ్రాయేలు అనుసరించాలి. "కాబట్టి మీరు కుడికే గాని యెడమకే గాని తిరుగక మీ దేవుడైన యెహోవా ఆజ్ఞాపించునట్లు చేయుటకు జాగ్రత్తపడవలెను" (ద్వితీయోపదేశకాండము 5:32). "ఆజ్ఞాపించునట్లు" అనగా ఆజ్ఞాపించినవి "మాత్రమే" చేయవలెనని అర్థం. ఈ సందేశము ఇశ్రాయేలుకు మాటి మాటికి అనేకసార్లు చెప్పబడింది. ఇశ్రాయేలు రాజులను సైతం నడిపించింది (ద్వితీయోపదేశకాండము 17:20; 28:14; యెహోషువ 1:7; 23:6; సామెతలు 4:27).

దేవుని ఆజ్ఞలలోనుండి వారేదియు కలుపకూడదు. తీసివేయకూడదు. "మీ దేవుడైన యెహోవా ఇచ్చిన ఆజ్ఞలను మీ కాజ్ఞాపించుచున్నాను. వాటిని గైకొనుటయందు నేను మీ కాజ్ఞాపించిన మాటతో దేనిని కలుపకూడదు. దానిలోనుండి దేనిని తీసివేయకూడదు" (ద్వితీయోపదేశకాండము 4:2; 12:32; సామెతలు 30:6 కూడ చూడు).

ఆయన ఆజ్ఞలనుండి తీసివేయకూడదని, కలుపకూడదని ప్రత్యేకించి దేవుని ప్రజలకు సూచించాడు. ఇలా చేయుటలో కారణం - ఆయన ఆజ్ఞలు పాటించాలని సూచించడానికి

ఇలా చెప్పబడింది (ద్వితీయోపదేశకాండము 4:2). దేవుడు ఆజ్ఞాపించినదానికి చేర్చేదేదైనా దేవుని ఆజ్ఞలు గాక మానవ అభీష్టాలైయుంటాయి. ఎవడైన చేర్చబడినవాటిని ఆచరించి నట్లయితే, అతడు దేవునికి లోబడుట లేదు. దేవుని ఆజ్ఞలనుండి ఎవడైన తీసివేసినట్లయితే దేవుడు కోరినదంతా చేసినవాడు కాడు గనుక అతడు దేవునికి లోబడువాడు కాడు.

క్రొత్త నిబంధన క్రింద ఉన్నవారికి యేసు అదే సూత్రాన్ని బోధించారు. “ఏవి ఆజ్ఞాపించారో వాటన్నిటిని గైకొనునట్లు” శిష్యులైనవారికి తన అనుచరులు బోధించాలని ఆయన తెలిపారు (మత్తయి 28:20). ప్రకటన గ్రంథమునుండి ఏవి తీసివేయకూడదని ఎవడును దీనికి కలుపకూడదని తెలిపారు (ప్రకటన 22:18, 19). ఇది కేవలం ప్రకటనకు మాత్రమే వర్తిస్తుందని కొందరన్నారు, సందర్భంలో అది నిజమే కాని బైబిలులోని ఏ యితర పుస్తకములకంటె ఈ పుస్తకాన్ని గూర్చియే దేవుడెక్కువగా ఆలోచిస్తాడా? ప్రకటన గ్రంథానికి చేర్చడం గాని దానిలోనుండి తీసివేయటం గాని తప్పే, కాని యితర లేఖనాల్లోనుండి తీసివేయటం, కలపటం అంగీకారమేనా?

పౌలు “సువార్తను” గూర్చి వ్రాసాడు, అందులో క్రైస్తవ సూత్రాలు కూడ చేర్చబడాలి (1 తిమోతి 1:9–11), మరొక సువార్తను ప్రకటించేవాడు శాపగ్రస్తుడని అది బోధిస్తుంది (గలతీయులకు 1:8, 9). ఇదే సమాచారాన్ని మాట్లాడుతూ యోహాను యిలా వ్రాసాడు, “క్రీస్తు బోధయందు నిలిచియుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు” (2 యోహాను 9). దేవుని ఆరాధించేవారు “ఆత్మతోను సత్యముతోను” ఆయనను ఆరాధింపవలెనని క్రీస్తు తెలిపారు (యోహాను 4:24). దేవుడు పరిమితులను నియమించాడు. రక్షింపబడ వెదకేవారు ఆ హద్దులో నిలిచియుండాలి (హెబ్రీయులకు 5:9). ఆయనను సరిగా ఆరాధింపగోరువారి విషయంలో గూడ అదే సత్యము.

దేవుడు ప్రస్తావించని ఆచారాలను ఆరాధనలో ప్రవేశపెట్టేవారు ఆరాధనలో ఉపయోగించవలసిన ప్రతి దానిని బయలుపరచలేదని గుప్తంగా చెప్పుతున్నారు. ఆలాంటి తత్వం దేవుని బయల్పాటు సంపూర్ణం అయినది కాదు అంటుంది.

## సత్యంతో ఆరాధన

క్రొత్త నిబంధన క్రింద ఆరాధన క్రీస్తు బయలుపరచిన సత్యంననుసరించియుండాలి. యాకోబు బావియొద్ద యేసును కలుసుకొనిన సమరయ స్త్రీ ఆరాధన స్థలాన్ని గూర్చి ఆయనను ప్రశ్నించింది. సమరయులు గెరిజీము పర్వతము మీద ఆరాధించేవారు, యూదులైనవారు యెరూషలేములో ఆరాధించేవారు.

యెరూషలేములో ఆరాధించడం సరియేనని యేసు సూచించారు. యూదుల ఆచరణలకు సమరయ ఆరాధనకు ఉండే సంబంధాన్ని గూర్చి ఆయన ఇలా చెప్పాడు. “మీరు మీకు తెలియనిదానిని ఆరాధించువారు, మేము మాకు తెలిసినదానిని ఆరాధించు వారము; రక్షణ యూదులలోనుండియే కలుగుచున్నది” (యోహాను 4:22). మార్పు త్వరలో రాబోతుంది. అప్పుడు నిజ ఆరాధకులు “ఆత్మతోను సత్యముతోను” ఆరాధిస్తారు (యోహాను 4:23, 24). ఆరాధన ఆత్మతోను సత్యముతోను “అయ్యుండాలి.” ఎవరి

యిష్టాలకు తావులేదు. గుప్తమైన సంగతి తేటగా ఉంది: సమరయులు నిజ ఆరాధకులు కారు, యూదులు ఆరాధించే దేవునియందే వారు నమ్మికయుంచారు, కాని తప్పు స్థలములో ఆరాధిస్తున్నారు. యోహాను 4:21–24 బోధించినదేమంటే ...

- దేవుని ఆరాధించేదంతా దేవునికి అంగీకారం కాదు. యేసు ఆ స్త్రీతో చేసిన ప్రతిపాదన సూచించేదేమంటే, వారు ఆరాధించిన, సమరయులు తమ ఆరాధనలో రైటు కారు.
- దేవునికి కేవలం ఆరాధన కంటే ఎక్కువ కావాలి. సమరయులు దేవుని ఆరాధించారు, కాని వారు ఎరుగక అలా చేశారు. "ఎందుకంటే [వారు] తమకు తెలియని దానిని ఆరాధించారు." వారి ఆరాధన తప్పు.
- యూదుల ఆరాధనా విధానం యిక మీదట ఆరాధనా విధానం కాదు. ధర్మశాస్త్రం క్రింద ఆరాధన స్థలముగా దేవునిచే కోరుకొనబడిన యెరూషలేము, ఇక మీదట ఆరాధన స్థలం కాదు.
- వస్తుందని యేసు చెప్పిన కాలంలో, క్రైస్తవ యుగమందు ఆత్మతో, సత్యంతో చేసే ఆరాధనను దేవుడు అంగీకరిస్తాడు.

సత్యము ఎలా నిర్ణయించబడుతుంది? సత్యము యేసు ద్వారా బయలుపరచబడింది (యోహాను 1:14, 17). యేసు బోధయందు నిలిచియుండుటవలన మనం "సత్యాన్ని గ్రహించగలం" (యోహాను 8:32). యేసు మాటలు దేవునినుండి వచ్చినందున (యోహాను 7:16; 12:49, 50; 14:24బి; 17:8) సత్యమైయున్నాయ్ (యోహాను 17:17). సత్య సంబంధులు యేసు మాట వింటారు (యోహాను 18:37), ఎందుకంటే సత్యము "యేసునందున్నది" (ఎఫెసీయులకు 4:21).

యేసు సత్యాన్ని తెచ్చారు. అప్పుడు సత్యము ఆయనయందున్నట్టు చూస్తాం. ఈ సత్యము దేవుని వాక్యంలో ఉంది, పైగా సర్వ సత్యము ఆత్మ ద్వారా బయలుపరచబడింది, గనుక ఆరాధనలో మనం చూచే ప్రతిది యేసుచే బోధింపబడిన సత్యమునకు పరిమితి చేయబడింది. ఆరాధన యికనేమాత్రము ధర్మశాస్త్ర ఉపదేశమును అనుసరించేదై ఉండదు. యేసు వాక్యమందు మనము నిలిచి ఉన్నట్టయితే సత్యాన్ని ఎరుగగలము.

**ధర్మశాస్త్ర ప్రకారము కాదు**

క్రొత్త నిబంధన ఆరాధన ధర్మశాస్త్రంపై ఆధారపడినది కాదు. మోషే ధర్మశాస్త్రాన్ని తెచ్చాడు; యేసు కృపయు, సత్యాన్ని తెచ్చాడు (యోహాను 1:17). ఆ సత్యము క్రైస్తవ ఆరాధనకు వర్తిస్తుంది. సత్యము మోషే ద్వారా రాకపోయినప్పటికి, అతని ఉపదేశము తప్పు కాదు. యేసు తెచ్చిన సత్యానికి ఛాయగా మోషే ఖచ్చితమైన ప్రాతినిధ్యం యిచ్చాడు. "ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయగలదియే గాని ఆ వస్తువుల నిజ స్వరూపము గలది కాదు" (హెబ్రీయులకు 10:1ఎ). ధర్మశాస్త్రం యొక్క ఆచరణలు "పరలోక సంబంధమగు వస్తువుల ఛాయా రూపకంగా" పని చేశాయి (హెబ్రీయులకు 8:5), ఈ

హేతువుచేత క్రైస్తవులు పాత నిబంధనయందు బోధింపబడి ఆచరించినవాటిమీద తమ ఆరాధనను ఆధారము చేసికోకూడదు. క్రైస్తవ ఆరాధన ధర్మశాస్త్రంపై ఆధారపడినట్టయితే, నేటి ఆరాధనలో జంతు బలులు చేర్చవలసియుంటుంది.

పాపక్షమాపణ కొరకు ఛాయా రూపకమైన జంతు బలులను క్రీస్తు బలియాగము నెరవేర్చింది. ధర్మశాస్త్రము నెరవేర్చబడి రద్దు చేయబడిందని బైబిలు అంటుంది (ఎఫెసీయులకు 2:14, 15). గనుక - బలులతో చేర్చి - ధర్మశాస్త్రము క్రిందనున్న ఆరాధనా విధానాలు రద్దు చేయబడ్డాయి.

క్రొత్త నిబంధన క్రింద యేసు బోధచే తీర్పు తీర్చబడతారు (యోహాను 12:48). యేసు బోధ ధర్మశాస్త్రం క్రింద జీవించినవారిని తీర్పు తీర్చదు. వారి తీర్పుకు ధర్మశాస్త్రము ఆధారమైయుంటుంది: "ధర్మశాస్త్రము కలిగినవారై పాపము చేసిన వారందరు ధర్మశాస్త్రానుసారముగా తీర్పు నొందుదురు" (రోమా 2:12బి).

ధర్మశాస్త్రము క్రింద జీవించినవారికంటే ధర్మశాస్త్రము లేకుండ ఉన్నవారికి తీర్పు ప్రమాణము వ్యత్యాసంగా ఉంటుంది. ధర్మశాస్త్రము క్రింద జీవించినవారికి మాత్రమే తీర్పు తీర్చడానికి ధర్మశాస్త్రం ఉపయోగపడుతుంది. ధర్మశాస్త్రము యివ్వబడక ముందు జీవించినవారికి అది తీర్పు తీర్చదు సరిగదా, ధర్మశాస్త్ర కాలంలో ఉన్న ఏ అన్యజనులకు కూడ తీర్పు తీర్చదు (రోమా 2:14), లేక ధర్మశాస్త్రము రద్దు చేయబడిన తరువాత జీవించినవారికి కూడ అది తీర్పు తీర్చదు (హెబ్రీయులకు 10:9).

క్రీస్తుననుసరించువారు ఆరాధన కొరకు ఆదేశాలకు ఆయనవైపు చూడవలసినవారై యున్నారు. ధర్మశాస్త్రపు ఆరాధన ఆచారాలు క్రైస్తవులకు వర్తించదు. క్రీస్తు మాటలు (యోహాను 12:48), ధర్మశాస్త్రం కాదు, వారి తీర్పుకు ఆధారమై ఉంటుంది.

క్రొత్త నిబంధన ఆరాధన యొక్క ఆత్మ సంబంధమైన వాస్తవాలను భౌతిక ఛాయలుగా ధర్మశాస్త్రము కలిగియుంది. క్రొత్త నిబంధన క్రింద ఆరాధన ఆత్మతో, సత్యముతో అయ్యుండాలి. జంతువులకు బదులుగా క్రైస్తవులు దేవునికి "యేసుక్రీస్తు ద్వారా అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులు" అర్పించవలసినవారైయున్నారు (1 పేతురు 2:5బి).

"అక్షరానుసారమైన ప్రాచీన స్థితిగలవారము కాక ఆత్మానుసారమైన నవీన స్థితి గలవారమై" మనము సేవ చేయుదము (రోమా 7:6; 2:29; 2 కొరింథీయులకు 3:6; ఫిలిప్పీయులకు 3:3లను చూడు). "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీయులకు 13:15).

### మనస్సాక్షి ప్రకారము కాదు

సంవత్సరాలు తరబడి యేసుచే ఆజ్ఞాపింపబడిన ఆచారాలు ఆరాధనలో ఉపయోగించ బడుతున్నందువలన వాటిని ఉపయోగించడంలో జనులు న్యాయమున్నట్టు తలంచుచున్నారు. వారి మనస్సాక్షి వారిని బాధించినట్లయితే వారి ఆరాధనలో తప్పేమి లేదని వారు తీర్మానించారు.

"మనస్సాక్షి" అనే పదం లాటిన్ భాషా పద రూపమునుండి వచ్చినట్లు చెప్పబడుతుంది. *Con* అంటే "తో" అని, *science* అంటే "తెలివి" అని అర్థమిస్తుంది. ఇది *suneidesis* అనే గ్రీకుకు సమానమైనది. దాని అర్థం "తెలివితో." మన వ్యక్తిగత న్యాయ సంబంధమైన విధానం అంటే మన మనస్సాక్షి, మనకు కలిగియున్న తెలివిమీద ఆధారపడుతుంది. ఒకనికి మంచి మనస్సాక్షి ఉంటే, తాను రైటని తలంచేదానిని చేసినప్పుడు, సరియైన సమాచారంగా కన్పించే దానిని ఆధారం చేసికొనేలా మనస్సు కలిగించబడతాడు. ఒకని మనస్సాక్షి మంచిది కాకపోతే, తాను తప్పు అని తలంచేది చేసినా అతడు చింతపడడు లేక తన పక్షంగా గెలవాలనే ఉద్దేశంతో వాస్తవాలను తారుమారు చేసినా బాధపడడు.

పౌలు క్రైస్తవులను చంపాలనుకున్నాడు. తమ దేవుని గాక ఏ యితర దేవతను ఆరాధించేవానికైనా మరణ శిక్ష విధించాలని ధర్మశాస్త్రం బోధించింది (నిర్గమకాండము 22:20; ద్వితీయోపదేశకాండము 17:2-5). యేసును సేవించేవారిని మంచి మనస్సాక్షితోనే పౌలు చంపాడు (అపొ. 23:1; 24:16), ఎందుకంటే, వారు వేరొక దేవతను ఆరాధించుతున్నట్టు అతడు తలంచాడు (అపొస్తలుల కార్యములు 26:9).

మనం దేవునికి విధేయులం కాకపోయినా, మనం మంచి చేస్తున్నట్టు తలంచితే, మన మనస్సాక్షి బాధించదు. మన ఆలోచన దేవుని వాక్యముచే నడిపింపబడి, అది ఏమి చెప్పుతుందో దానికి మనం లోబడినట్టయితే, బాధింపబడని మనస్సాక్షి ప్రతిఫలమిస్తుంది. ఏది మంచిదో అది చేస్తూ కూడ మనం తప్పేదో చేస్తున్నట్టు తలంచితే మన మనస్సాక్షి బాధించగలదు. నిజమని అతడు దేన్ని ఎరిగాడో దానికి భిన్నంగా జీవించే వ్యక్తి యొక్క దుష్ట మనస్సాక్షి బాధించలేదు. మనం చేసేది సరియైనదే అనే తీర్పు మన మనస్సాక్షితో చేయించడానికి బదులు దేవుని వాక్యము మన ప్రమాణంగా మనం ఉపయోగించాలి (1 యోహాను 4:1, 6 చూడు).

**మానవ పారంపర్యముల ప్రకారంగా**

పారంపర్యము (గ్రీకు.: *paradosis*) అనేది ఒక ఉపదేశముగాని లేక ఆచారముగాని ఒకరినుండి మరొకరికి అందింపబడింది. ఈ పారంపర్యము మంచిదో కాదో తీర్మానించడానికి మూడు పరీక్షలు సహాయం చేస్తాయి: (1) దానికి మూలమేమి? (2) దేవుని ఉపదేశమునుండి అది తీసివేస్తుందా, కలుపుతుందా? (3) అది దేవుడు తాను కోరుకున్న పరిధిలోని ఆచారమా?

పారంపర్యము యొక్క మూలము ప్రాముఖ్యమైనది. పారంపర్యము దేవుని యొద్దనుండి వచ్చినదైతే దాన్ని మనం అంగీకరించాలి. ఆ పారంపర్యము మనుష్యులనుండి కలిగినదైతే దేవుడు కోరుకున్న పరిధిలోని ఆచారానికి అదేమి కలపనిదైతే మనం దాన్ని అంగీకరింపవచ్చు.

మానవ ఆజ్ఞలు మరియు పారంపర్యాలకు సంబంధించి ప్రభువైన యేసు శాస్త్రులు, పరిసయ్యులతో మాట్లాడారు:

> “మీరును మీపారంపర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించు చున్నారు?” (మత్తయి 15:3).
>
> “ ‘మానవులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు నన్ను వ్యర్థముగా ఆరాధించుదురు.’ ... మీరు దేవుని ఆజ్ఞను విడిచిపెట్టి, మనుష్యుల పారంపర్యా చారమును గైకొనుచున్నారు. మరియు ఆయన – మీరు మీ పారంపర్యాచారమును గైకొనుటకు దేవుని ఆజ్ఞను బొత్తిగా నిరాకరించుదురు.”
>
> ... “మీరు నియమించిన మీ పారంపర్యాచారమువలన దేవుని వాక్యమును నిరర్థకము చేయుదురు. ఇటువంటివి అనేకములు మీరు చేయుదురని చెప్పెను” (మార్కు 7:7–13).

పౌలు యిలా వ్రాశాడు, “ఆయనను అనుసరింపక మనుష్యుల పారంపర్యాచారమును, అనగా ఈ లోకసంబంధమైన మూలపాఠములను అనుసరించి మోసకరమైన నిరర్థక తత్వ జ్ఞానముచేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవడైన ఉండునేమో అని జాగ్రత్తగా ఉండుడి” (కొలొస్సయులకు 2:8). “యూదుల కల్పనాకథలను, సత్యమునుండి తొలగిపోవునట్టి మనుష్యుల కట్టడలను లక్ష్యపెట్టకయుండాలని” పెద్దలకు ఉపదేశించ వలసిందిగా అతడు తీతును ఆదేశించాడు (తీతు 1:14).

క్రైస్తవుల గురి క్రీస్తుని వెంబడించడం. దేవుని ఉపదేశములో చేర్చబడని మనుష్యుల వలన కలిగిన ఆచారాలనుండి మనం తొలగిపోవాలి.

మంచి పారంపర్యములు అనేవి క్రీస్తునుండి అపొస్తలుల క్రొత్త నిబంధన ప్రవక్తల ద్వారా అనుగ్రహింపబడిన ఆచారములే (ఎఫెసీయులకు 2:20; 3:5). ఈ పారంపర్యము లనే మనం అనుసరించాలి (1 కొరింథీయులకు 11:1; 2 థెస్సలొనీకయులకు 2:15; 3:6).

దేవుడు కోరుకొనినవాటితో సంఘర్షణ పడేలా ఉన్న మానవ పారంపర్యము తప్పు. దేవుడు ఏదైన కోరుకొననట్టయితే అవి రైటు కావు, తప్పు కావు. మన సొంత యిష్టం ప్రకారం వీటిని అలవర్చుకోవచ్చు. బాప్తిస్మము ఒక మంచి ఉదాహరణ. బాప్తిస్మమందు మనం “పాతిపెట్టబడతాం” (రోమా 6:4; కొలొస్సయులకు 2:12). మనం “ముంచబడి నట్లయితే” కేవలం దేవుడు కోరుకున్నట్టు మనం చేస్తున్నాం. చిలకరించడం మానవ పారంపర్యాన్ని కలపడం ఔతుంది. అది అనంగీకారం. ఎందుకంటే, దేవుడు వేరేదాన్ని కోరుతున్నాడు. ఒక వ్యక్తిని పాతిపెట్టే ఒక పారంపర్య మార్గం, వెనుకతట్టుగా నీటిలో ముంచుట. పారంపర్యంగా, ఇది అంగీకారమే, నీటిలో ముందుకు ముంచిన, ప్రక్కలకు ముంచిన లేక మరి ఏ యితర విధంగా ముంచిన అది అంతే కరక్టు అవుతుంది.

పారంపర్యం యొక్క మూలం ప్రాముఖ్యం. ఒక పారంపర్యం దేవునినుండి వచ్చినదైతే, అప్పుడు దానిని ఆచరించడం రైటే. దేవుడు కోరుకున్న పరిధిలో దేనినైన అది ఉల్లఘించినట్లయితే ఆలాటి మానవ పారంపర్యం అనుసరించడం తప్పు.

## ఆత్మతో ఆరాధన

ఆరాధన కేవలం రూపములోనే మాత్రము కాదు, ఆత్మలో కూడ రైటైె ఉండాలి. దేవుడు కేవలం పెదవుల కదలిక గానము చూస్తూ వినటం మాత్రమే గాక, ఆయన హృదయములోని గానాన్ని కూడ వినగలడు. మానవ అంతరంగంలోనుండి అది రాకుంటే బాహ్యామైన కదలిక చలనములు క్షణంసేపు కూడ ఆరాధనను పుట్టించదు. ఆరాధన సత్యంతో "ఉండాలి," గాని అది ఆత్మతో కూడ "ఉండాలి" (యోహాను 4:23, 24). ఆరాధన దేవుడు ఆజ్ఞాపించిన రూపంలో ఉన్నప్పటికీ, అందులో ఆత్మతో ఆరాధించకపోతే విలువ లేదు.

దేవునికి కేవలము మనోహరమైన శబ్దాలే కావలసినట్లయితే వృత్తిపరమైన సంగీతము, ప్రార్థనలు, ప్రసంగాలు కూడిన స్థలములో చేయవచ్చు. ఆరాధన ఆత్మతో చేయాలని దేవుడు కోరుకొనకపోయినట్టయితే, స్థానిక సంఘం యింట ఉండి పని చేయుచు లేక రికార్డు చేసిన దానిని జరిగిస్తూ ఆరాధించవచ్చు గదా.

మన బాహ్యపు ఉచ్చరణలు దేవుడు కోరతాడు: అయితే దానికంటే మరి ఎక్కువగా, హృదయము దానిని వెంబడించాలని ఆయన వాంఛిస్తాడు. "ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుచు" అనేది క్రైస్తవ ఆరాధనలో చేర్చబడాలని పౌలు వ్రాశాడు (ఎఫెసీయులకు 5:19). మన హృదయాంతరంగాల్లోనుండి దేవుని యొద్దకు చేరుకుంటేనే తప్ప మన కార్యకలాపాలు అంగీకరింపబడవు; అలా కాకుంటే మన ప్రయాసలన్ని వ్యర్థమైనవియు, విలువలేనివియునై ఉంటాయ్.

ఆయన ఆజ్ఞలకు లోబడుటవలన మనము క్రీస్తును ప్రేమిస్తున్నట్టు కనుపరచగలం (యోహాను 14:15, 21–23). శిష్యులుగా అయ్యేవారు ఆయన ఆజ్ఞాపించినవాటినన్నిటిని గైకొన బోధించాలని ఆయన అపొస్తలులకు చెప్పారు (మత్తయి 28:20).

ఆయన ఆజ్ఞాపించినవాటినన్నిటిని గైకొనవలెననుటలో గుప్తమైనవి ఏమి? (1) ఏ ఆజ్ఞయు విడచిపెట్టకుండ ఆయన ఆజ్ఞాపించినవన్నియు మనం చేస్తాం? (2) ఆయన ఆజ్ఞాపించిన దానికి మించి ఏమియు చేయకుందుము. ఆయన ఆజ్ఞాపించినదానికి అధికంగా ఏమి చేసిన ఆయన ఆజ్ఞాపించింది చేస్తున్నట్టు కాదు. (3) ఆయన ఏమి ఆజ్ఞాపించాడో దానికంటె తక్కువగా మనం చేయకూడదు. మనం తక్కువగా చేస్తే ఆయన ఆజ్ఞాపించినవన్ని మనము గైకొనుట లేదు. (4) ఆయన ఆజ్ఞాపించినదాన్ని మనం మార్చం, దాన్ని మనము మార్చినట్లయితే అప్పుడు ఆయన ఏమి ఆజ్ఞాపించాడో దానిని మనం చేయుట లేదు.

ఆయన వారికి ఆజ్ఞాపించినవన్నియు గైకొనాలని తన అనుచరులకు బోధించనున్న యేసు ఆజ్ఞకు అపొస్తలులు లోబడ్డారు. తొలి క్రైస్తవులను గూర్చి లూకా యిలా వ్రాసాడు, "అపొస్తలుల బోధయందు ఎడతెగక యుండిరి" (అపొస్తలుల కార్యములు 2:42ఎ). సంఘ ఆరాధనకు సంబంధించిన సూచనలు అపొస్తలుల బోధయందు యివ్వబడ్డాయి. లేఖనములయందు "వ్రాయబడినవాటిని అతిక్రమించకూడదని" పౌలు క్రైస్తవులకు బోధించాడు (1 కొరింథీయులకు 4:6).

## సంగ్రహము

దేవుడు నియమించిన కొలపరిమాణాలలో సత్యారాధన ఉండాలి. ఆత్మతోను, సత్యముతోను తన్ను ఆరాధించవలెనని ఆయన కోరుతున్నాడు. ఆయన ఆజ్ఞాపించిన దానినుండి ఏమియు తీసివేయకూడదు దానితో ఏమియు కలుపకూడదు. ఆయనను పోలిన ఆరాధన యొక్క సాధారణమైన రమ్యతకు మనలను మనము పరిమితి చేసికోవాలి. మనుషులను ఒప్పించుటకు కాకుండ దేవుని స్తుతించుటకు మనం ఆరాధించాలి.